క్లుప్తంగా...

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న వినయ్ దేశ్‌పాండే

జియాగూడ: ఈశానేశ్వర స్వామిని దర్శించుకున్న వారికి సుఖశాంతులు లభిస్తాయని కేసరి హనుమాన్ ఆలయ మహంత్ నారాయణ్ దేశ్‌పాండే మహారాజ్ అన్నారు. ఆదివారం జియాగూడ లోని జై రఘువీర సమర్థ, శ్రీకేసరి హనుమాన్ మహా సంస్థానంలో గల ఆలయ ప్రాంగణంలో శ్రీ ఈశానేశ్వర ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా యజ్ఞమహోత్సవం, పూర్ణాహుతి, అంకరణ, అఖండ హారతి, అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు సందీప్ దేశ్‌పాండే, దేవేందర్ దేశ్‌పాండే, మయూర్ తదితరులు పాల్గొన్నారు.

రామాయణ్ మేళా చీఫ్ కన్వీనర్‌గా గోవింద్‌రాఠి



అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే రామాయణ్ మేళా చీఫ్ కన్వీనర్‌గా బీజేపీ గోషామహల్ నియోజకవర్గం నాయకులు గోవింద్‌రాఠి నియమితులయ్యారు. అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 24వ తేదీ వరకు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర ఎకనామిక్ కమిటీ, రాజస్థాని ప్రగతీ సమాజ్ ఆధ్వర్యంలో 51వ రామాయణ్ మేళా వేడుకలు నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో ప్రజలకు రామాయణ పఠనం, రామాయణం పట్ల వలు బోధనలు, వేషధారణలు చేపట్టి ప్రజల్లో మరింత ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా దాండియా వేడుకలు, కవి సమ్మేళనం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. దసరా రోజు వేలాది మందితో రావణ దహనం చేపడుతామన్నారు.

ప్రత్యేక పూజలు



విజయనగర్‌కాలనీ: శ్రావణమాసం చివరి ఆదివారం వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆసిఫ్‌నగర్ దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ మందిరంలో ఆదివారం వెంకటేశ్వరస్వామికి అర్చనలు, అభిషేకాలు, నిర్వహించి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు ముత్తయిదువలకు పసుపు కుంకుమలతో పాటు వాయనాలు ఇచ్చి ఆశీర్వాదాలు పొందారు. అదేవిధంగా విజయనగర్‌కాలనీ లక్ష్మీగణపతి ఆలయం, హనుమాన్ ఆలయం, బాలత్రిపుర సుందరీదేవి ఆలయం, శ్రీ పెద్దమ్మతల్లి ఆలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అశోక్, శశికళ, లలిత, సుజాత, స్వరూప, బసవరాజు, జి.గురు, రెడ్డి, సురేఖ, శోభా, సరోజ పాల్గొన్నారు.

యాకుత్‌పురా నుంచి నళినిగౌడ్ దరఖాస్తు



గౌలిపురా: యాకుత్‌పురా శాసనసభ నియోజకవర్గం నుంచి తనకు టికెట్ కేటాయించాలని కోరుతూ ఆదివారం గౌలిపురా అయోధ్యనగర్‌కు చెందిన బీజేపీ మహిళా మోర్చా కోశాధికారి కొండ నళినిగౌడ్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొంతకాలంగా పార్టీలో పని చేస్తూ పార్టీ ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన తనకు ఈసారి యాకుత్‌పురా నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు వరలక్ష్మి, అర్చన, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు


ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న రాజ్‌కుమార్

చాంద్రాయణగుట్ట: పార్టీ పటిష్టతకు అహర్నిశలు కృషి చేస్తున్న తన సేవలను గుర్తించి చాంద్రాయణగుట్ట బీజేపీ టికెట్ కేటాయించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు వై.రాజ్‌కుమార్ కోరారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ..చిన్నప్పటి నుంచి బీజేపీ పట్ల ఆకర్షితుడినై కొనసాగుతున్నానన్నారు. మైనార్టీ ప్రాభల్యం ఉన్న నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం పాటు పడ్డానన్నారు.

గోషామహల్ బీజేపీ టికెట్‌కు దరఖాస్తు



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం బీజేపీ టికెట్ కోసం గోల్కొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రఘునందన్ యాదవ్ ఆదివారం దరఖాస్తు చేసుకున్నారు. అబిడ్స్ కట్టెలమండిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన తన దరఖాస్తులు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయం వద్ద మజ్లిస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్వాన్, లంగర్‌హౌజ్ డివిజన్ల నుంచి పలువురు ఆయన వద్దకు వచ్చి పలు సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు, రోడ్లు బాగా దెబ్బతిన్నాయన్నారు. తాను బల్దియా, జలమండలి అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి రోడ్లు, డ్రైనేజీల విషయం వారి దృష్టికి తీసుకెళ్లాన్నన్నారు. టోలిచౌకి, టూమ్స్ రోడ్, గోల్కొండ, ఎండిలైన్స్, కంపెనీ బాగ్ తదితర ప్రాంతాల్లో భారీ వరద నీటి పైపు పనులు జరుగుతున్నాయని ఆ ప్రాంతాల్లో భారీ తవ్వకాలతో ప్రజలకు సమస్యలు తలెత్తుతున్నాయని అయితే సాధ్యమైనంత వరకు సమస్యలు తలెత్తకుండా చూడాలని తాను అధికారులకు సూచించానన్నారు.

చెక్కుల పంపిణీ.

నిరుపేద కుటుంబాలకు షాదీముబారక్, కల్యాణ లక్ష్మి పథకం వరం లాంటిదని ఎమ్మెల్యే అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ రోజ్ ఫంక్షన్‌హాల్‌లో గోల్కొండ రెవెన్యూ అధికారులతో కలిసి షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను 342 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, బదర్‌ఉద్దీన్, ఆలీ ముద్దీన్ తదితరులున్నారు.

పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి


సమావేశంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తదితరులు

గోల్కొండ: పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. రానున్న వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండగల ఏర్పాట్లపై ఆదివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండపాల నిర్వాహకులు, మిలాద్ నబీ వేడుకల కమిటీల వారు తమతమ కార్యక్రమాల వివరాలను పోలీసులకు ముందుగానే ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు ఎస్.రాజువస్తాద్, హబీద్, ఇలియాస్ అక్బర్, షానవాజ్‌ఖాన్, ఏ.పరమానందం, బీ. శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు



లక్డీకాపూల్: బోనాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర అన్నారు. ఆదివారం హైకోర్టులో బోనాలు ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర ఫుడ్ కమిషన్ సభ్యులు కొంత గోవర్ధన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు పులిగారి గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ.. బతుకమ్మ బోనాలు పండుగలను రాష్ట్ర పండుగలుగా గుర్తిస్తూ.. కేసీఆర్ ప్రభుత్వం విశేష ప్రాచుర్యం కల్పించిందన్నారు. గతంలో బోనాలు పండగ జరుపుకోవడానికి అనేక పర్మిషన్ల కోసం అధికారుల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, ప్రభుత్వ న్యాయవాదులు, స్టాండింగ్ కౌన్సిల్, హైకోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో మరోసారి బీజేపీదే విజయం


దరఖాస్తు చేసుకుంటున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోల దీపక్‌కుమార్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించి మరోసారి బీజేపీ విజయం సాధిస్తుందని రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి కోల దీపక్ కుమార్ పేర్కొన్నారు. అబిడ్స్ కట్టెలమండిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గోషామహల్ బీజేపీ టికెట్ కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా పార్టీ బలోపేతానికి, పార్టీ పటిష్టతకు నిరంతరం కృషిచేస్తున్న తనకు టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తానన్నారు. అక్షర ఫౌండేషన్ ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు ఉచిత విద్యను బోధిస్తూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతునట్లు తెలిపారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు టికెట్ కేటాయిస్తే బీసీలతో పాటు అన్నివర్గాల ప్రజల మద్దతు తనకే ఉంటుందన్నారు.

కార్వాన్ నుంచి టికెట్ ఇవ్వండి


బయోడేటాను అందజేస్తున్న సతీష్ బిడ్ల

జియాగూడ: కార్వాన్ నుంచి దళితుడైన తనకు అవకాశం కల్పించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర వాల్మీకి సమాజ్ సెల్ మాజీ అధికార ప్రతినిధి సతీష్‌బిడ్లా అన్నారు. ఆదివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్నికల అధికారికి తన బయోడేటాను అందజేశారు. అనంతరం సతీష్‌బిడ్ల మాట్లాడుతూ.. బీజేపీలో 20 ఏళ్ల నుంచి సామాన్య కార్యకర్తగా పనిచేస్తూ ఉమ్మడి రాష్ట్రంలో వాల్మీక్ సమాజ్ సెల్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించానన్నారు. సీనియర్ బీజేపీ నాయకుడు మాణిక్ ప్రభు, అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు సూరజ్‌బిడ్లా, సంతోష్‌కుమార్, నరేష్, విజయ్ రీడాలన్, శివశంకర్, ప్రకాష్ సింగ్, రఘునందన్ సింగ్, వీరేంద్ర సింగ్ పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతల పేర్లను ప్రకటించిన ధృవం ఫౌండేషన్


పురస్కార గ్రహీతల పేర్లను ప్రకటిస్తున్న రమణాచారి, చిత్రంలో వారణాసి సౌమ్య

నాంపల్లి: సుప్రసిద్ధ సాహితీవేత్త, కవి, తెలుగు వర్సిటీ విశ్రాంత ఉపాధ్యక్షుడు దివంగత ఆచార్య జీవీఎస్ సుబ్రహ్మణ్యం పేరిట ధృవం ఫౌండేషన్ సంస్థను నెలకొల్పి తద్వారా సాహితీవేత్తలను, విద్యావేత్తలను గుర్తించి ప్రతియేటా పురస్కారాలు అందజేయడం సంతోషించదగ్గ విషయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అభినందించారు. ఆదివారం మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ధృవం ఫౌండేషన్–2023 సాహితీ, సారస్వత పురస్కార గ్రహీతల పేర్లను ప్రకటించారు. ప్రముఖ పద్య కవి, వ్యాఖ్యాత బేతవోలు రామబ్రహ్మంకు జీవీఎస్ సుబ్రహ్మణ్యంకు సాహితీ పురస్కారాన్ని, కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు కాత్యాయని విద్మహేకు సుశీలా సుబ్రహ్మణ్యం సారస్వత పురస్కారాన్ని అందజేస్తున్నట్లు రమణాచారి వెల్లడించారు. ఈ పురస్కార ప్రదానోత్సవం సభ అక్టోబరు 20న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరుగుతుందని ధృవం ఫౌండేషన్ చైర్‌పర్సన్, జీవీఎస్ సుబ్రహ్మణ్యం మనుమరాలు వారణాసి సౌమ్య పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలతోనే అధికారంలోకి బీజేపీ


దరఖాస్తును అందజేస్తున్న సీనియర్ వెన్న ఈశ్వరప్ప

అబిడ్స్: ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమ పథకాలతోనే రాష్ట్రంలో బీజేపీ అధికారంలో వస్తుందని సీనియర్ బీజేపీ నాయకుడు వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాతనే అన్నివర్గాల ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. అబిడ్స్ కట్టెలమండిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పరిగి నియోజకవర్గం బీజేపీ టికెట్ కోసం వెన్న ఈశ్వరప్ప దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సబ్‌కాసాత్..సబ్‌కా వికాస్ కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. అన్నివర్గాల ప్రజలు బీజేపీ వైపే మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు.



పూసలబస్తీలో ఉట్ల కార్యక్రమం

అబిడ్స్: మంగళ్‌హాట్ పూసలబస్తీలో ఉట్ల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బాలబాలికలకు కృష్ణ, యశోద, రాధా, గొల్లబామల వేషధారణలు వేయించి ఉట్ల కార్యక్రమం చేపట్టారు. వాస్తు శిల్పి, ఆర్కిటెక్ ఇంజినీర్ ఆవుల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ఆవుల అరుణల ఆధ్వర్యంలో ఉట్ల కార్యక్రమం ఆడంబరంగా చేపట్టారు. మంగళ్‌హాట్ పూసలబస్తీతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ఉట్ల కార్యక్రమాన్ని తిలకించారు. శ్రీకృష్ణ, యశోధారులకు, ఉట్ల కార్యక్రమ విజేతలకు ఆవుల కృష్ణారావు, ఆవుల అరుణ బహుమతులు అందజేశారు.

చాంద్రాయణగుట్ట బీజేపీ టికెట్ కేటాయించండి


దరఖాస్తు అందజేస్తున్న పొన్న శ్రీనివాసారావు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీజేపీ టికెట్‌ను తనకు కేటాయించాలని ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా కోశాధికారి పొన్న శ్రీనివాసారావు కోరారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో తన బయోడేటాను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 1998 నుంచి పార్టీలో కొనసాగుతున్నానన్నారు. అన్ని రకాల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశానన్నారు. తనకు టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జియాగూడ: మూసీ వరదలో ఈనెల 7న గుర్తుతెలియని మృతదేహం కొట్టుకువచ్చినట్లు కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నిఖిత తెలిపారు. ఆమె ఆదివారం వివరాలు వెల్లడించారు. గిరకపల్లి మూసీనది ఒడ్డున గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చినట్లు డయల్ 100 ద్వారా సమాచారం లభించడంతో పోలీసులు షేక్ సుజత్‌అలీ, నవీన్‌దాస్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించినట్లు తెలిపారు. మృతుడు హిందువు అయ్యి ఉంటాడని, 40–45 ఏళ్ల వయస్సు కలిగి ఉంటాడని, ఒంటిపై మెరూన్ టీ షర్టు, బ్లాక్ అండర్‌వేర్ ఉందని, చేతిపై సునంద రిశేశ్వర్‌రావు, లక్ష్మీ ఐలవ్‌యూ అని పచ్చబొట్టు ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి


గుడిమల్కాపూర్‌లో..

గోల్కొండ: తెలంగాణ మహిళలల ధైర్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప మహిళ చాకలి ఐలమ్మ అని గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సునీల్‌యాదవ్ అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్ చౌరస్తా పూలే విగ్రహం వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ నాయకులతో కలిసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

అఫ్జల్‌గంజ్: సీఎం కేసీఆర్ చొరవతో తమకు గుర్తింపు వచ్చిందని సారోళ్ల సోమవంశ క్షత్రియ కుల నాయకులు బోరేద ప్రవీణ్ కుమార్, జాజేరావు వేదకర్ ఆనందం వ్యక్తం చేశారు. గౌలిగూడలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ..ఎన్నో ఏళ్లుగా తమ కులాన్ని గత ప్రభుత్వాలు గుర్తించలేదని, 2020లో సీఎం కేసీఆర్ తమ కులాన్ని గుర్తించి బీసీ జాబితాలో చేర్చారాని నేడు తమకు 3వ పండగ రోజని గుర్తుచేశారు. తమ కులాన్ని గుర్తించి రిజర్వేషన్ కల్పించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్ నారాయణ, రాంప్రసాద్, కైలాస్ పవర్, వెంకటేష్ గౌలి, ప్రేమ్ కుమార్ గౌలి, నిర్మల్ యాదవ్ ఆహీర్ పాల్గొన్నారు.

పాతబస్తీలో దంచికొట్టిన వర్షం


వరద నీటిలో మీరాలంమండి కూరగాయల మార్కెట్

చార్మినార్: పాతబస్తీలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించిన సందర్శకులు పలు ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లపై నీరు నిలిచి పోవడంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించిన వాహనదారులు పడరాని పాట్లు పడ్డారు. మీరాలంమండి కూరగాయల మార్కెట్ పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వినియోగదారులు, రైతులు, వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వరదనీటిలోంచే వాహనదారులు ఇటు నుంచి అటు వెళ్లడం కనిపించింది. వరదనీటిని డ్రైనేజీ కాలువల్లోకి పంపించడానికి స్థానిక కూరగాయల వ్యాపారులు ప్రయత్నించారు.

ఘనంగా బొడ్రాయి స్థాపన

గోల్కొండ: షేక్‌పేట్‌లో బొడ్రాయి స్థాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. సెంట్రల్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న బొడ్రాయి స్థాపన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. షేక్‌పేట్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సెంట్రల్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు చాట్ల సదానంద్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

గోషామహల్ బీజేపీ అభ్యర్థిగా గోవింద్‌రాఠి దరఖాస్తు


నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్న గోవింద్‌రాఠి

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు గోవింద్‌రాఠి నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గోవింద్‌రాఠి మాట్లాడుతూ.. తాను ఎన్నో ఏళ్లుగా బీజేపీ సీనియర్ నాయకులుగా ఉన్నానని గోషామహల్ నియోజకవర్గంలో ఉత్తర భారతీయులు ఎక్కువ ఉన్నందునా తనకు టికెట్ కేటాయిస్తే బీజేపీ నుంచి సునాయాసంగా విజయం సాధిస్తానని ఆయన తెలిపారు. అధిష్టానం తనకు గోషామహల్ నుంచి టికెట్ కేటాయించాలని ఆయన కోరారు.

నాంపల్లి బీజేపీ టికెట్‌కు నందులాల్ దరఖాస్తు

నాంపల్లి: సీనియర్ బీజేపీ నేత డి.నందులాల్ నాంపల్లి నియోజకవర్గం బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం మల్లేపల్లిలోని తన నివాసం నుంచి నాంపల్లి కట్టెలమండిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా నందులాల్ తన దరఖాస్తు ఫారాన్ని పూరించి రాష్ట్ర కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తనకు బీజేపీ టికెట్ కేటాయిస్తే ఎంఐఎం పార్టీ పతనం నాంపల్లి నుంచి ప్రారంభం అవుతుందన్నారు.


దరఖాస్తు ఫారాన్ని అందజేస్తున్న నందులాల్

ఘనంగా గణేష్ ఆగమన్ శోభాయాత్ర


శోభాయాత్రలో ఫిరోజ్‌ఖాన్, ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని గోషామహల్ గణేష్ ఆగమన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గణనాథునికి స్వాగతం పలుకుతూ బ్యాండ్ మేళాలతో గణపతి బప్పా మోరియా అంటూ ఎంతో ఉత్సాహంగా గణేష్ ఆగమన్ శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, బజరంగ్‌సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..ఈ సంవత్సరం గణేష్ ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం గణనాథునికి స్వాగతం తెలుపుతూ.... గణేష్ ఆగమన్ శోభాయాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి గణేష్ నవరాత్రులు ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు. సంస్థ ప్రతినిధులు సూర్యశుక్లా, వివేక్‌యాదవ్, సంతోష్ యాదవ్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

చార్మినార్ టికెట్ కేటాయించండి

చార్మినార్: ఈసారి జరిగే శాసన సభ ఎన్నికల్లో చార్మినార్ నుంచి తనకు టిక్కెట్ కేటాయించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆదివారం దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం పాతబస్తీ దారుషిఫా నుంచి ఆయన తన అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి తన దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్నికలలో తనకు టికెట్ కేటాయిస్తే విజయం సాధించి పార్టీ అధిష్టానానికి పాతబస్తీ నుంచి బహుమతిగా అందజేస్తానన్నారు.


దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

కార్వాన్‌లో బీజేపీదే విజయం


బీజేపీ నాయకులు, కార్యకర్తలతో అమర్‌సింగ్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఈసారి బీజేపీ అభ్యర్థి విజయం ఖాయమని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం ఆయన గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద గల తన కార్యాలయంలో బీజేపీ వివిధ మోర్చాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం తన పాలనతో రాష్ట్రాన్ని దివాలా తీయించిందన్నారు. నేడు మోదీ పాలన, సమర్థతకు ప్రపంచ అగ్రదేశాలన్ని ప్రశంసిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన దేశం అగ్రదేశంగా రూపొందిందని అంతరిక్షంలో మన దేశం సాధిస్తున్న విజయాలు ప్రధాన మోదీ సమర్థతకు నిదర్శనమని ఆయన అన్నారు.

ఉత్సాహంగా తీజ్ వేడుకలు


ఉత్సవాల్లో పాల్గొన్న ముప్పిడి సీతారాంరెడ్డి

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ డివిజన్‌లోని రవీంద్ర నాయక్‌నగర్‌లో తీజ్ పండుగ ఉత్సవాలను బంజారాలు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. చివరి రోజు కావడంతో సంత్ సేవాలాల్ మహరాజ్‌కు మహిళలు సంప్రదాయ వస్త్రాధారణలో మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో కాలనీలో ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి ముప్పిడి సీతారాం రెడ్డి, జంగమ్మెట్ డివిజన్ అధ్యక్షురాలు స్వరూప రాంసింగ్, జాతీమ మైనార్టీ కమిషన్ మెంబర్ సయ్యద్ షహజాదీ, కాంగ్రెస్ నాయకులు గణేష్ నాయక్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.